నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 | KHAMMAM

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కందాళ, సండ్ర

ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ అరెస్ట్‌ను ఖండిస్తున్నాం..

అక్రమ కేసుల బనాయింపు హేయమైన చర్య

కచ్చితంగా ఇవి కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలే

జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసే కుట్ర జరుగుతున్నది..

సమావేశంలో బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, ఫిబ్రవరి 8: ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్, చేగొమ్మ సొసైటీ చైర్మన్ ఇంటూరి శేఖర్ అరెస్ట్‌ను ఖండిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరిత వైఖరికి అక్రమ అరెస్టులే నిదర్శనమని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మండిపడ్డారు. ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేయాలని రాష్ట్రప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఎమ్మెల్యే అని, ఆ సమయంలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాలకు తాము హాజరయ్యామని, నాడు భట్టివిక్రమార్క కార్యక్రమానికి విచ్చేసే వరకు వేచిచూసే వారమని గుర్తుచేశారు. మధిరలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రారంభోత్సవానికి నాడు తనతోపాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల ఖమ్మం రూరల్ మండల పరిధిలోని తీర్థాల జరిగిన ఓ సమీక్షా సమావేశానికి తనను ఆహ్వానించలేదని, అలాగే ఇటీవల ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన ఓ సమీక్షా సమావేశానికి నగర మేయర్ నీరజను సైతం ఆహ్వానించలేదని మండిపడ్డారు. జిల్లా మంత్రులు ప్రభుత్వాధికారులు, పోలీస్‌శాఖలో ఉన్నతాధికారులకు కాల్ చేసి బీఆర్ఎస్ నాయకులకు ఎలాంటి పనులు చేయవద్దని హుకుం జారీ చేస్తున్నారని ధ్వజమెత్తారు.

జీవో నంబర్ 59 ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు వెల్లడించండి..

ప్రస్తుతం జిల్లాలో మట్టి తవ్వకాలు, జీవో నంబర్ 59 పైనే రాజకీయాలు నడుస్తున్నాయని స్పష్టం చేశారు. తాను 59 జీవో ద్వారా లబ్ధిపొందిన వారి జాబితాను ప్రకటించాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరుతున్నానని, లేదా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిజ నిర్ధారణ కమిటీ వేసి అక్రమాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నాయకులు అక్రమాలకు పాల్పడితే ప్రజలు ఎలాంటి శిక్ష విధించినా భరిస్తారని, అలా చేయకుండా కేవలం బీఆర్ఎస్ నాయకులు మాత్రమే జీవో 59 ద్వారా భూములు తీసుకున్నారని ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. జిల్లాలో నాలుగు హైవే రహదారుల పనులు జరుగుతున్నాయని, వాటి నిర్మాణానికి అవసరమైన మట్టిని స్థానికంగానే సేకరించాలని తాను ప్రభుత్వాన్ని కోరానన్నారు. తన కృషితో ప్రస్తుతం రహదారి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. కూసుమంచి మండలం జీళ్లచెరువులోని ఆలయ గుట్టపైకి వెళ్లేందుకు నాడు కేసీఆర్ ప్రభుత్వం రోడ్డు వేయాలని నిర్ణయించిందని, నిర్మాణానికి నాటి పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి స్వచ్ఛందంగా రూ.కోటి సాయం అందించారని, ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ కూడా ఇతోధికంగా సాయం చేశారని గుర్తుచేశారు. అలాంటి శేఖర్‌పై అక్రమంగా కేసులు బనాయించడం దారుణమన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆలయ పాలకమండలి సభ్యుల్లో ఒకరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉన్నారని, ఆయన్ను పోలీసులు కులం పేరుతో దూషించడం అనాగరిక చర్య అని అభిప్రాయపడ్డారు. దళితులంటే పోలీసులకు చిన్నచూపు ఉందన్నారు. ఇంటూరి శేఖర్‌తో తనకు వ్యాపార లావాదేవీలు ఉన్నాయని, ఆయన తన బినామీ అని కొందరు పనిగట్టుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ఆరోపణలను నిరూపిస్తే తాను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం పాల్గొన్నారు.

జీళ్లచెరువు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్, మిషన్ భగరథ స్పెషల్ ఆఫీసర్ సందీప్‌కుమార్ సుల్తానియా (ఫైల్)

తాగునీటికి గడ్డుకాలం!

- ఇప్పటికే సాగునీరు లేదు.. ఇకపై తాగునీటి కష్టాల్లోకి 'పాలేరు'
- కేఆర్ఎంబీలోకి 'నాగార్జున సాగర్' వెళ్లాక మరిన్ని ఇబ్బందులు
- 'పాలేరు'లోని ప్రస్తుత నిల్వలు మార్చి 15 వరకే సరిపోయే పరిస్థితి
- ఆ తరువాత 2,439 గ్రామాలకు తాగునీటి సరఫరాకు ఆటంకం
- ఇప్పటికే పరిస్థితిని పరిశీలించి వెళ్లిన 'భగీరథ' ఎస్వో సుల్తానియా
- ప్రత్యామ్నాయంగా వేసవికి 'శ్రీరాంసాగర్' నీటిని మళ్లిస్తారో లేదో..!
- 'సీతారామ'తోనే నీటి కష్టాలు తొలగిపోతాయంటున్న నిపుణులు

కూసుమంచి, ఫిబ్రవరి 8 : పాలేరు జలాశయం కింద ఇప్పటికే ఉన్న సాగునీటి కష్టాలకు.. ఇప్పుడు తాగునీటి ఇబ్బందులూ తోడయ్యాయి. మొత్తంగా తాగునీటికైతే గడ్డుకాలం తప్పేలా లేదు. ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇప్పుడు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి వెళ్లడంతో నీటి ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. ఎగువ జలాశయాల్లోనూ నీటి నిల్వలు లేకపోవడంతో నీటి ఎద్దడి తీవ్రమవుతోంది. జలాశయాల నిర్వహణ అమలు రాష్ట్రాల పరిధిలో ఉన్నప్పుడు తాగునీటి విషయంలో కొన్ని అవకాశాలు ఉండేవి. సాధ్యాసాధ్యాలను ఆలోచించి అవసరమున్నచోట దిగువ జలాశయాల్లోకి నీటిని విడుదల చేసుకునే అవకాశం ఉండేది. కానీ.. ఇప్పుడు ఇలా నీళ్లు వదలాలంటే కేఆర్ఎంబీ పూర్తి అనుమతులు రావాలి.

వేసవి గడవడం ఎలా..?

పాలేరు జలాశయం నుంచి ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాలోని 2,439 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం పాలేరు నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో ఈ వేసవి గడవడం కష్టంగా మారింది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆరా తీశారు. పాలేరు పరిస్థితి పరిశీలనకు ఇటీవల ఉన్నతాధికారులను పంపారు. అయితే ప్రత్యామ్నాయంగా శ్రీరాంసాగర్ నుంచి నీటిని మళ్లిస్తే తప్ప వేసవిలో పాలేరు కింద నీటి కష్టాలు తప్పేలా లేవు. అయితే ఇటీవల జిల్లాకు వచ్చిన పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, మిషన్ భగీరథ స్పెషల్ ఆఫీసర్ (ఎస్వో) సందీప్‌కుమార్ సుల్తానియా.. రోజంతా ఇక్కడే ఉండి పాలేరు నీటి మట్టం, ప్రస్తుత నిల్వలు, నీటి సరఫరా వంటి అంశాలను పరిశీలించి సమీక్షించి వెళ్లారు. ప్రస్తుత నీరు మార్చి చివరి వరకే సరిపోతుందని, తరువాత ప్రత్యామ్నాయం ఏంటనే అంశాలపై చర్చించారు. మళ్లీ సాగర్ నుంచి నీటిని తీసుకోవాలంటే కేఆర్ఎంబీ అనుమతులు రావడం కష్టం కావడంతో ముందస్తు చర్యలపై చర్చిస్తున్నారు.

పూర్తిగా తగ్గిన ఇన్‌ఫ్లో..

అయితే తాగునీటి కోసం సాగర్ నుంచి పాలేరుకు ఇటీవల విడుదల చేసిన నీరు 1.50 టీఎంసీలుగా నమోదైంది. కానీ.. కాలువల్లో లాస్‌లు, నీటి ఆవిరి వంటి కారణాలతో తగినంత నీరు పాలేరుకు రాలేదు. ఒక్కరోజు మాత్రమే 4,500 క్యూసెక్కులు వచ్చాయి. తరువాత క్రమంగా తగ్గుతూ గురువారం మధ్యాహ్నం వరకు 1,187 క్యూసెక్కులు చేరుకున్నాయి. పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 17.20 అడుగులు మాత్రమే ఉంది. మిషన్ భగీరథకు ఇచ్చే నీటితో రోజుకు 0.25 అడుగుల చొప్పున తగ్గుతోంది. దీంతో ఈ నిల్వలు నెల రోజులు కూడా సరిపోయే పరిస్థితి లేదు. మార్చి 15 తరువాత తాగునీటికి కష్టాలు మొదలుకానున్నాయి.

2.41 లక్షల ఇళ్లకు నీటి సరఫరాపై ప్రభావం..



పాలేరులో హెవీ మోటర్లు

పాలేరు రిజర్వాయర్ నుంచి ఐదు జిల్లాలోని 2,41,129 ఇళ్లకు మిషన్ భగీరథ ద్వారా నిత్యం తాగునీరు సరఫరా అవుతోంది. పాలేరు ఇన్‌టేక్‌వెల్ నుంచి ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాలకు, నాయకన్‌గూడెం పంప్‌హౌస్ నుంచి సూర్యాపేట జిల్లాకు తాగునీటిని అందిస్తున్నారు. అలాగే, గుర్వాయిగూడెం నుంచి 38 గ్రామాలకు, పాలేరు నుంచి 35 గ్రామాలకు, జీళ్లచెరువు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి ఖమ్మం నగరంతోపాటు ఖమ్మం జిల్లాలోని 203 గ్రామాలకు, మాదిరిపురం నుంచి మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లోని 1,769 గ్రామాలకు, అన్నారుగూడెం నుంచి సూర్యాపేట జిల్లాలోని 41 గ్రామాలకు, చండ్రుపట్ల నుంచి 185 గ్రామాలకు, చిల్వకుంట్ల నుంచి 168 గ్రామాలకు కలిపి మొత్తం 2,439 గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఇలా తాగునీటి అవసరాల కోసం రోజుకు 0.013706 టీఎంసీల చొప్పున ఏడాదికి 5.09467 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారు. తాజా గడ్డు పరిస్థితి నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రభావం కన్పిస్తోంది. అయితే సీతారామ ప్రాజెక్టు నిర్మాణంతోనే పాలేరు కింద సాగునీటి, తాగునీటి కష్టాలు తొలగిపోతాయని నీటిపారుదల రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

17 అడుగుల వద్ద పాలేరు జలాశయం

అక్రమ కేసుల బనాయింపు అమానుషం..

ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లుపై పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. అది హేయమైన చర్య. బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదు. కుట్ర పూరితంగా అక్రమ కేసులు పెట్టడం అమానుషం. పోలీసులు కూడా బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో అది మంచిది కాదు.

– మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

కుట్రలను తిప్పి కొడతాం..

రాజకీయపరమైన కక్షసాధింపు చర్యలు సరైన విధానం కాదు. డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ అరెస్టును మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. సూర్యాపేట–ఖమ్మం హైవే నిర్మాణానికి భారీగా మట్టి అవసరమైంది. ఎమ్మెల్యేగా తాను ఎంతో శ్రమపడి వివిధ ప్రాంతాల నుంచి మట్టి తెప్పించాను. ఇదే సందర్భంలో జీళ్లచెరువు చెరువు నుంచి కూడా ఇరిగేషన్ శాఖ అనుమతితో మట్టిని తోలించాం. అందుకు తగిన సొమ్మును ప్రభుత్వానికి చెల్లించాం. ఈ విషయంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌కు గానీ, ఆలయ పాలకమండలి సభ్యులకు గానీ ఎలాంటి సంబంధం లేదు. జీళ్లచెరువు గుడికి వెళ్లేందుకు వీలుగా రోడ్డు నిర్మించేందుకు నేను స్వయంగా రూ.కోటి ఇచ్చాను. బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేయాలనే ఉద్దేశంతోనే అక్రమ కేసుల బనాయింపు. కార్యకర్తలు భయపడాల్సిన పనిలేదు. కక్షపూరిత చర్యలను ఎదుర్కొంటాం. పోరాడతాం. కుట్రలను తిప్పికొడతాం.

– మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

సర్వే సిబ్బందికి సమాచారం ఇవ్వండి : కలెక్టర్ వీపీ గౌతమ్

చింతకాని, ఫిబ్రవరి 8 : సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్ పథకాలకు సంబంధించి ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు, సిబ్బందికి యజమానులు సమగ్ర సమాచారం ఇవ్వాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. వందనం గ్రామంలో చేపట్టిన సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్ పథకాలకు సంబంధించి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు ఇవ్వడంతోపాటు ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగి ఉండి.. తప్పులు దొర్లిన ప్రతి కుటుంబానికి సంబంధించిన ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచుకొని సర్వే సిబ్బందికి తెలియజేయాలన్నారు. సర్వే సిబ్బంది సైతం డేటా ఎంట్రీ ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. అలాగే నాగులవంచ, పందిళ్లపల్లి, వందనం, నేరడ తదితర గ్రామాల్లో చేపట్టిన సర్వేను జడ్పీ సీఈవో వింజం వెంకట అప్పారావు, డీఆర్‌డీవో విద్యాచందన పరిశీలించి.. అధికారులకు సూచనలిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శులు చెవుల మహేశ్, వల్లంకొండ మరళి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

వందనంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమ్

అభివృద్ధి పనులను తక్షణమే చేపట్టాలి

- ఆకాంక్షిత జిల్లాల కింద మంజూరైన వాటిని సత్వరమే పూర్తిచేయాలి
- అధికారుల సమీక్ష సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): యాస్పిరేషనల్ (ఆకాంక్షిత) బ్లాక్‌లో మంజూరైన అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. పెండింగ్ పనులను కూడా సత్వరమే చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యాస్పిరేషనల్ పనుల తీరుపై విద్య, వైద్య, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, పశు సంవర్ధక శాఖ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇరిగేషన్ శాఖల అధికారులతో ఐడీవోసీలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మిషన్ భగీరథ మంచినీరు సరఫరా కాని గ్రామాల్లో బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. సోలార్ విద్యుత్ ద్వారా మంచినీరు సరఫరా చేసేందుకు కూడా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, ఇప్పటికే చేపట్టిన పనులను నిరంతరాయంగా కొనసాగించాలని, పనుల్లో జాప్యం చేయవద్దని ఆదేశించారు. జిల్లాలో 165 పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు అనుమతులు జారీ చేసినట్లు చెప్పారు. అలాగే, 274 పశువులకు చికిత్స చేసే ట్రైవీస్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 240 పనులు మంజూరు చేశామన్నారు. ఈ పనులకు మొత్తం రూ.2.35 కోట్లు వ్యయం కానుందన్నారు. అలాగే, 20 నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశామని అన్నారు. వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు, శిరీష, సులోచనారాణి, విజేత, డేవిడ్ రాజు, తానాజీ, డాక్టర్ పురంధర్, వెంకటేశ్వరచారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

ఆస్పత్రికి అవినీతి జబ్బు!

- జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమారస్వామి సరెండర్
- డేటా ఎంట్రీ ఆపరేటర్ల వద్ద డబ్బులు వసూలు చేశారనే ఆరోపణ
- తాత్కాలిక సూపరింటెండెంట్‌గా డాక్టర్ నరసింహారావు

కొత్తగూడెంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రి

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : పనితీరులో నిర్లక్ష్యం, పలు అవినీతి ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుమారస్వామిని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల సరెండర్ చేస్తూ ఆ శాఖకు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగూడెం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించగా.. వారికి ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే వారి వద్ద నుంచి సూపరింటెండెంట్ కొంత సొమ్మును డిమాండ్ చేసి ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయనపై విచారణ చేయించిన కలెక్టర్.. పూర్తి వివరాలు తెలుసుకోవడంతోపాటు గతంలో ఆఫీసు వ్యవహారాల్లో కూడా నిర్లక్ష్యం చేయడంతో ఆయన పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో గురువారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు సరెండర్ నోటీసు పంపారు. వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉన్నతాధికారుల అండదండలతో..

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపరింటెండెంట్ కుమారస్వామి.. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను కనీసం ఆస్పత్రికి కూడా రానీయలేదనే ఆరోపణలు వచ్చాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉన్న జిల్లా ఆస్పత్రితో మెడికల్ కాలేజీ, ఎంసీహెచ్ అనుబంధంగా ఉండేవి. వాటిపై మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఉండేవారు. కానీ.. ఏనాడూ జిల్లా ఆస్పత్రికి రాకుండా సూపరింటెండెంట్ పెత్తనం చేశారని, ఉన్నతాధికారుల అండదండలతో వ్యవహారాలు నడిపించేవాడని తెలిసింది. అంతేకాక.. డాటా ఎంట్రీ ఆపరేటర్లు 21 మందిని కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఏజెన్సీ నుంచి కాకుండా వారి వద్ద నుంచి ఎంతో కొంత తీసుకొని నేరుగా నియమించినట్లు తెలిసింది. వారంతా ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది. కాగా.. సూపరింటెండెంట్ కుమారస్వామిని సరెండర్ చేయడంతో ఆయన స్థానంలో ఆర్థో విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ నరసింహారావుకు బాధ్యతలు అప్పగించారు.

ఆరోపణల విషయం తెలియదు

ఆస్పత్రి వ్యవహారాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కలెక్టర్ సరెండర్ చేశారు. అంతేకాక ఆయనపై పలు ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. తాత్కాలికంగా మరో డాక్టర్‌కు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించాం.

– డాక్టర్ లక్ష్మణ్‌రావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

గురుకుల బాలికలకు ప్రశంసలు

బాలికలను అభినందిస్తున్న గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి, డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి

భద్రాచలం, ఫిబ్రవరి 8 : భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల/కళాశాల బాలికలు సూపర్ స్టూడెంట్స్ టీ–శాట్ లైవ్ ప్రోగ్రాంలో భాగంగా హైదరాబాద్‌లో బుల్లితెరపై పాఠాలు బోధించి మన్ననలు అందుకున్నారు. 9వ తరగతి చదువుతున్న ఆర్.మౌనిక తెలుగులో శతక పద్యం, ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న బి.జమున ఎకనామిక్స్‌లో మనీ బ్యాంకింగ్ విధానంపై పాఠాన్ని బోధించి ఔరా అనిపించారు. బాలికలు బోధించిన తీరును మెచ్చుకుంటూ రాష్ట్ర గిరిజన గురుకుల, సోషల్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ(ఐఏఎస్) అధికారి కె.సీతాలక్ష్మి, డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతిని అందజేశారు. కాగా.. విద్యార్థులను గురువారం గిరిజన గురుకుల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెండెం దేవదాస్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల టీచర్లు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

రాజ్యసభ సభ్యుడిగా చివరి ప్రసంగంలో వద్దిరాజు రవిచంద్ర

రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఫిబ్రవరి 8: రాజ్యసభ సభ్యుడిగా తాను చరిత్రలో నిలిచిపోయే శాసనాల్లో భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నానని, సభ్యుడిగా ఉన్నంతకాలం తనకు సహకరించిన నేతలు, ఎంపీలందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ప్రకటించారు. ఢిల్లీలోని పార్లమెంట్‌లో గురువారం జరిగిన పెద్దల సభ చివరి ప్రసంగంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో అడుగుపెట్టే అవకాశం కల్పించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆజన్మాంతం రుణపడి ఉంటానన్నారు. రాజ్యసభ సభ్యుడిగా తాను 20 నెలల్లో పాత పార్లమెంట్‌లోనూ, కొత్త పార్లమెంట్‌లోనూ కూర్చున్నందుకు అదృష్టవంతుడిగా భావిస్తున్నానన్నారు. తాను మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కోసం పార్లమెంట్‌లో చర్చించినందుకు, తెలంగాణలో ఏదైనా ఒక సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని మాట్లాడినందుకు ఆనందంగా ఉందన్నారు. ముమ్ముందు కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మరిన్ని సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నానని తన ప్రసంగాన్ని ముగించారు.